క్లుప్తంగా

కమిటీ ఆమోదం తర్వాత వేతనాలు ఇస్తాం

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కోవిడ్ కార్మికులు, అదనపు కార్మికుల రెన్యువల్ ప్రక్రియలో జాప్యం జరిగిందని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిని రెన్యువల్ చేయాలని స్టాండింగ్ కమిటీకి పంపామని, కమిటీ ఆమోదం తర్వాత వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లిస్తామన్నారు.

అన్నదానం



కడప అర్బన్ : కడప నగరంలోని కొండాయపల్లికి చెందిన దివంగత శివహర్షత్ చౌదరి జయంతి సందర్భంగా అతని నాయనమ్మ ప్రియమోద కాటం హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలోని బృందా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, పుట్టా పురుషోత్తం, దామోదర్ పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కళాశాలల అఫిలియేషన్‌లో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. తిరుమలేష్ కోరారు. ఈ మేరకు బుధవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి అనుమతులు ఇచ్చారన్నారు. వేర్వేరు రాష్ట్రాల అభ్యర్థులు కళాశాలలకు రాకపోయినా ప్రవేశాలు కల్పిస్తూ విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని, ఇలాంటి సంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ వైవీయూ నాయకులు భరత్‌సింహ, కిశోర్, రవి, ఆసిఫ్ పాల్గొన్నారు.

మైనార్టీల హక్కులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎం. శాంత

కడప అర్బన్ : భారతదేశంలో మైనార్టీ హక్కులపై అవగాహన పెంచుకుని, వాటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ డిప్యూటీ కౌన్సిల్ ఎం. శాంత అన్నారు. బుధవారం మైనార్టీల హక్కుల దినోత్సవంను జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలుర హైస్కూల్‌లో నిర్వహించారు. ఎం. శాంత మాట్లాడుతూ ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, జొరాస్ట్రియన్‌లు (పార్శీలు) నేషనల్ కమిషన్ ఫర్ మైనారిటీస్ చట్టం 1992 లోని సెక్షన్ 2(సి) ప్రకారం మైనారిటీ కమ్యూనిటీలుగా ప్రకటించారన్నారు. ఆర్టికల్ 15, ఆర్టికల్ 16, ఆర్టికల్ 27, 28, 29, 350బిలపై అవగాహన పెంచుకోవాలని, వాటిని వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 151000ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సి. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ బీనా దేవరాజ్

కడప అర్బన్ : 'మధ్యవర్తిత్వం' అనేది వివాదాలను పరిష్కరించే ఓ మంచి పద్ధతి అని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ వారి మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ రీసోర్స్ పర్సన్ బీనా దేవరాజ్ అన్నారు. రెండు రోజులుగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారంగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కడపలోని జిల్లా కోర్టులో కడప న్యాయవాదుల సంఘం భవనంలో గంటపాటు బుధవారం న్యాయవాదులకు శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బీనా దేవరాజ్‌తో పాటు డాక్టర్ ఎస్. పద్మ పలు అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సమస్యల తిష్ట..!



జిల్లా కలెక్టర్ రిమ్స్ పరిశీలన సమయంలో అంధకారంలో వున్న ఓపీ క్యాంటీన్ ప్రాంతం



నేలపైన కూర్చున్న రోగుల సహాయకులు

- టాయిలెట్స్ వద్ద విరిగిన కుర్చీలు
- నేలపైనే కూర్చున్న రోగులు, వారి సహాయకులు
- ఓపీ క్యాంటీన్ ప్రాంతంలో లైట్లు లేక అంధకారం
- ట్యాప్స్‌లేక... నీళ్లు రాక ఇబ్బందులు
- మానసిక వైద్యశాలలో తుప్పుపట్టిన కుర్చీలు
- రిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్‌కు సమస్యల స్వాగతం

కడప అర్బన్ : కలెక్టర్‌గా విధుల్లో చేరిన తరువాత మొదటిసారిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ బుధవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో పర్యటించారు. ఆయనకు పలు సమస్యలు స్వాగతం పలికాయి. ఓపీ విభాగంలో డాక్టర్స్ రోగులకు వైద్య పరీక్షలను అందించే విధానంను అడిగి తెలుసుకున్నారు. ఈక్రమంలో టాయిలెట్స్‌ను పరిశీలించారు. అక్కడ విరిగిన కుర్చీలను చూసి నిర్వహణ సరిగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. మూలనపడ్డ కుర్చీలను ఎందుకు అక్కడ ఉంచారని ప్రశ్నించారు. స్టోర్ రూంకు వాటిని షిఫ్ట్ చేయాలన్నారు. ఓపి విభాగంలో క్యాంటీన్ వున్న ప్రాంతంలో నేలపైనే రోగులు, వారి సహాయకులు ఉండటంతో అక్కడ కుర్చీలను ఏర్పాటు చేయించాలని సూచించారు. అలాగే ఆ ప్రాంతంలో విద్యుత్ బల్బ్‌లు లేకపోవడంతో చీకటిగా ఉండడంతో వెంటనే ఈ ప్రాంతంలో లైట్స్ వేయించాలని ఆదేశించారు. ట్యాప్స్ లేకపోవడంతో నీరు లేక ఇబ్బందులు పడుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐపీ విభాగంలో లిఫ్ట్ పనిచేయక పోవడంపై ప్రశ్నించారు. క్యాజువాలిటీ వద్ద రోగులను తీసుకుని వెళ్లేందుకు కేవలం ఓ స్ట్రెక్చర్, వీల్ చెయిర్ మాత్రమే ఉండడంపై ఆరా తీశారు. ఓపీ, ఐపీ విభాగాల పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, మానసిక వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్‌ను పరిశీలించారు. మానసిక వైద్యశాలలో తుప్పుపట్టిన కుర్చీలు కనిపించడంతో అక్కడ ఎందుకు వేశారని ఆయన ప్రశ్నించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలు పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.



ట్యాప్స్ లేని నీటి విభాగం

• సార్.. వచ్చారని..



జిల్లా ఆసుపత్రికి చైర్మన్ అయిన కలెక్టర్ శ్రీధర్ చేరుకూరి రిమ్స్‌లో బుధవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు విభాగాలను ఆయన పరిశీలించారు. కాగా.. కొన్ని వార్డులలో కలెక్టర్ వస్తుండడాన్ని గమనించి స్ప్రే చేస్తూ.. బెడ్‌లలో బెడ్‌షీట్‌లు మారుస్తూ.. వైద్య సిబ్బంది హడావిడిగా కనిపించారు. కనిపించడం జరిగింది, ఓ పి విభాగం లొ చైర్లు విరిగి పోయి నెలపై కూర్చొని ఉన్న రోగులు చూస్తూ వెళ్లిపోయారు ఈ దృశ్యాలు సాక్షి కెమెరా తీసిన చిత్రాలు.

• పేదల కష్టాలు దేవుడికెరుక..



రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం వేలాది మంది ఉచిత వైద్యం కోసం వస్తుంటారు. అయితే ఇక్కడ వసతులు మాత్రం అరకొర ఉండడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చక్రాయపేట మండలం చిలేకం పల్లికి చెందిన మస్తాన్ అనే వ్యక్తి అనారోగ్యంతో మంచం పట్టాడు. దీంతో అంత దూరం అయినా అతడిని వారి కుటుంబీకులు రిమ్స్‌కు ఆటోలో తీసుకుని వచ్చారు. అరగంట నిరీక్షణ తరువాత స్ట్రెచర్ దొరకడంతో ఆటో నుంచి స్ట్రెచర్ పై అవస్థలు పడుతూ అత్యవసర విభాగానికి తరలించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ఉంటే అరగంట సేపు స్ట్రెచర్ అందుబాటులో లేకపోతే రోగులు పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

- ఫొటో : సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప

తాకట్టు పెట్టిన స్థలాల్లో నిర్మాణాలు చేస్తే చర్యలు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థకు తాకట్టు పెట్టి, మళ్లీ అందులో నిర్మాణాలు సాగిస్తే సహించేది లేదని కమిషనర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం, బుగ్గ కాలనీలను ఆయన పరిశీలించారు. చిన్నచౌకులోని రెడ్డి కాలనీలో శ్రీ నిలయం అపార్ట్‌మెంట్, సీఆర్ఎస్ రెసిడెన్సీ వారు మార్టిగేజ్ కోసం దరఖాస్తు చేయడంతో ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి జరిమానా విధించాలన్నారు. పాత మున్సిపల్ కార్యాలయంలో నీటి ట్యాంకు పాడవడం వల్ల కొత్త ట్యాంకు నుంచి నీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ సజావుగా నీటి సరఫరా చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. బుగ్గ కాలనీలో గిఫ్ట్ డీడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన నిర్మాణ పనులు, అనుమతులు లేకుండా చేపట్టిన గృహాన్ని తక్షణమే తొలగించడానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిటీ ప్లానర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ధనలక్ష్మి, డిప్యూటీ సిటీ ప్లానర్ రమణ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్ రెడ్డి

సీపీఎం జిల్లా మహా సభలు జయప్రదం చేయండి

కడప వైఎస్సార్ సర్కిల్ : సీపీఎం కడప జిల్లా 12 వ మహాసభలు జనవరి 4, 5 తేదీల్లో కడప నగరంలో నిర్వహించనున్నామని, వాటిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలియజేశారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా మహాసభలు కడప నగరంలోని అజ్మత్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నామన్నారు. మహాసభల సందర్భంగా మొదటి రోజు జియాన్ కాలేజీ వద్ద నుండి ఐటిఐ సర్కిల్ వరకు ర్యాలీ, ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఐటిఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సీపీఎం చేసిన కృషిని సమీక్ష చేసి రానున్న కాలంలో ప్రజల సమస్యల పట్ల పార్టీ చేయాల్సిన పోరాటాలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, అన్వేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

దివ్యాంగులకు అండగా నిలవండి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో సౌకర్యాలను కల్పిస్తోందని, వాటన్నింటిని వారికి అందేలా మండల విద్యాశాఖ అధికారులు అండగా నిలవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య సహాయక కో- ఆర్డినేటర్ కల్పనా శైలా సూచించారు. బుధవారం కడప నగర శివారులోని గీతం కళాశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందాల్సిన పథకాల పైన ఎంఈఓలకు ఒక రోజు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బడి బయట ఉండే విద్యార్థులందరినీ బడిలో చేర్పించాలన్నారు. అలాగే ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వం కల్పించే ప్రతి సౌకర్యం అందేలా చూడాలని కోరారు. ఓఎస్‌సి కో ఆర్డినేటర్ గీతా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డాక్టర్ వెంకట రాముడు, క్లినికల్ సైకాలజిస్ట్ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఫక్రుద్దీన్, సదరం సర్టిఫికెట్ విభాగాధిపతి నాగయ్యతో పాటు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య హాజరై వివిధ విభాగాలకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి, ఏడీ కృష్ణ కిషోర్, సహిత విద్యా సమన్వయకర్తలు కేశవరెడ్డి రమణమూర్తి, వివిధ మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్పనా శైలా

కొనసాగుతున్న దీక్షలు

కడప అర్బన్ : కక్షి దారుల వివాదాలను సత్వరం పరిష్కరించడానికి న్యాయవ్యవస్థను ప్రజల ముంగిట్లోకి తీసుకోవాల్సిన పాలకులు.. అందుకు భిన్నంగా ప్రజలకు దూరం చేయడం సరైనది కాదని భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ అన్నారు. జీఓ నంబర్ 145కు వ్యతిరేకంగా కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలలో భాగంగా పదవ రోజు రిలే నిరాహార దీక్షల్లో కడప ఉమ్మడి జిల్లా భారత న్యాయవాదుల సంఘం నాయకులు సుబ్రమణ్యం, ఈశ్వర్, ఆనంద్ కుమార్, పి. రెడ్డయ్య, నాగమణి, రవిశంకర్, నిరంజన్, ఉత్తేజ్ కుమార్ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం, ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ జీఓ తీసుకొని వచ్చినా, చట్టం చేసినా అప్పటివరకు ప్రజలకు ఉన్న సౌకర్యం కంటే మెరుగైనదిగా ఉండాలని, అలాకాకుండా ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఉండకూడదని అన్నారు. జీఓ నంబర్ 145 వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రప్ప, ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి మారుతి రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, మహిళా సంఘం నాయకురాలు భాగ్యలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి బాదుల్లా, బికేఎంయూ డిప్యూటీ కార్యదర్శి మల్లికార్జున, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి నిరాహార దీక్ష శిబిరానికి మద్దతు తెలిపారు. బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, నందలూరు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దీక్షకు మద్దతు తెలిపారు.



కడప కోర్టు ఎదురుగా నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నేడు, రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు పోరుమామిళ్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అభి గ్రీన్ టెక్నాలజీ, యంగ్ ఇండియాలో వివిధ హోదాల్లో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా అగ్రికల్చర్, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 7 వేల నుంచి రూ. 21 వేల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ధృవపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు.

- మైదుకూరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా, యంగ్ ఇండియా, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ మెకానికల్ చదివి 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ. 12వేల నుంచి రూ. 18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.
- కమలాపురంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. అల్ డిక్సన్, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలలో టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివి 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. రూ. 12వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో ఈనెల 17వ తేదీన మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉంచినట్లు ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు. ఈనెల 8న అనారోగ్యంతో చేరిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడని.. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని ఆయన కోరారు.

జూనియర్ కళాశాలల్లో తనిఖీలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలలో తనిఖీలు నిర్వహించి, మౌలిక వసతులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కడపలోని ఇంటర్ ఆర్‌జేడీ రవిని కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకుడు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

145 జీఓ రద్దు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 145 జీఓను తక్షణమే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రప్పకోరారు. బుధవారం కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జాషువ, ఉమా నాగిరెడ్డి, లా విద్యార్థి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సేవా పురస్కారం

కడప కల్చరల్ : విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, సామాజిక కార్యక్రమాల నిర్వాహకులు జడపల్లె రాధాకృష్ణకు సమాజ సేవారత్న పురస్కారం లభించింది. బుధవారం ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు తుపాకుల నారాయణ, నూనె నగేష్, పెండ్లిమర్రి మల్లయ్య, సుబ్బారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాసులు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యరంగంపై సర్వే

కడప సెవెన్‌రోడ్స్ : వికసిత్ భారత్–2047లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో వయస్సు వారీగా వ్యాధిగ్రస్తుల ప్రాబల్య రేటు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ఎన్ఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సర్వే చేపడుతున్నామని ఆ సంస్థ ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకులు గంపా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కడప నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రాంతీయ శిక్షణా క్యాంపులో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వ జాతీయ గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జనవరి నుంచి సంవత్సరం పాటు ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. నైపుణ్యం కలిగి శిక్షణ పొందిన ఎన్ఎస్ఎస్ క్షేత్ర సిబ్బంది ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణ బ్లాక్‌లను సందర్శిస్తారని తెలిపారు. వైద్య సంరక్షణ కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి ప్రజల నుంచి వివరాలు సేకరిస్తారన్నారు. ఎన్ఎస్ఓ దక్షిణ ప్రాంత కార్యాలయ పరిధిలోని 13 జిల్లాల క్షేత్ర స్థాయి సిబ్బందికి రెండు రోజులపాటు ఇక్కడ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల జీవన వ్యయంపై తీవ్ర ప్రభావం చూపుతున్న పెరిగే వైద్య ఖర్చులు, సామాన్యునికి అందని ద్రాక్షగా మారుతున్న కార్పొరేట్ వైద్య సేవలు, వినియోగం, ప్రసూతి, శిశు జననాల కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వినియోగం వివరాలను నమోదు చేస్తామన్నారు. ప్రాంతీయ కార్యాలయ సంయుక్త సంచాలకులు అనిత పార్థసారథి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి, ఎన్ఎస్ఓ క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో అధికారులు

మరింత ప్రగతి దిశగా పయనించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలతో ఉన్నత పనితీరును కనపర్చినప్పటికీ మరింత ప్రగతి దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఓ) ప్రతినిధి, హెచ్.వై.ఎం. ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య స్పష్టం చేశారు. వైవీయూలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) ప్రతినిధుల బృందం రెండు రోజుల సందర్శన పూర్తయింది. అనంతరం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి, అన్ని శాఖల అధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ శివయ్య మాట్లాడుతూ రెండు రోజుల విశ్వవిద్యాలయ సమగ్ర పరిశీలనలో బృందం దృష్టికి వచ్చిన పలు అంశాలను ప్రస్తావించారు. అన్ని శాఖలు బాగా పనిచేస్తున్నాయని ప్రశంసిస్తూనే మరింతగా పనిచేస్తే ఉన్నతమైన న్యాక్ గ్రేడును వైవీయూ సొంతం చేసుకుంటుందన్నారు. హెచ్.వై.ఎం. ఇంటర్నేషనల్ ఆడిటర్ టి. సుమాదేవి మాట్లాడుతూ వైవీయూ అభివృద్ధికి మెరుగైన సూచనలు చేశారు. వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐఎస్ఓ ప్రతినిధుల బృందం విశ్వవిద్యాలయానికి సంబంధించి వాస్తవ నివేదికను ఇచ్చిందని, వారి సూచనలు పాటించి అభివృద్ధి దిశగా ముందుకు వెళతామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ ఫైల్ మేనేజ్మెంట్ పై బోధనేతర సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ప్రధానాచార్యులు ఎస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ప్రతి డాక్యుమెంటేషన్‌కు ఇకపై ఆధారాలు ఉండేలా చూస్తామన్నారు. ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ ఎల్ సుబ్రహ్మణ్యం శర్మ, ఐక్యూఏసి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుభోష్ చంద్ర, సభ్యులు ఆచార్య రియాజున్నిసా, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ టి. శ్యామ్ స్వరూప్, డాక్టర్ దాక్షాయని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎస్ఓ ప్రతినిధి ఆలపాటి శివయ్య

అంబేడ్కర్ అణగారిన వర్గాలకు దేవుడు

కడప కార్పొరేషన్ : అంబేడ్కర్ అంటే ఫ్యాషన్ కాదని అణగారిన వర్గాల దేవుడని, అలాంటి వ్యక్తిని కించపరిచేలా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడడం సరైనది కాదని దళిత ఫోరం నేత బూసిపాటి కిషోర్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై చర్చ సందర్భంగా రాజ్యసభలో హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కడపలోని దళిత ఫోరం కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్, అంబేడ్కర్.. అని పలకడం ఫ్యాషన్‌గా మారిందని.. అమిత్ షా అనడం ఆయనలోని అహంకారానికి నిదర్శనమన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గమే నేడు దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల్లో వెలుగులు నింపిందన్నారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం కోట్లాది మందికి పవిత్ర గ్రంథమన్నారు. అందుకే ఆయనను ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా దేవుడిగా ఆరాధిస్తారన్నారు. అందువల్లే ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అంటూ గుర్తు చేసుకుంటారని చెప్పారు. బీజేపీ నేతలు అంబేడ్కర్‌ను ఎంతగా ద్వేషిస్తున్నారో అమిత్ షా వ్యాఖ్యలు ధృవీకరిస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో దళిత ఫోరం నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం

కడప అర్బన్: తన పుట్టినరోజు వేడుకల కోసం ఏకంగా రోడ్డును బ్లాక్ చేసి టపాసులు పేల్చడం, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడంతో స్థానికులు, వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ వేడుకలకు కారణ మైన బెన్నీ అనే యువకుడిని కడప వన్‌టౌన్ సీఐ బి. రామకృష్ణ బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్నామని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే గాకుండా, ప్రజలను భయాందోళనకు గురి చేసిన యువకుడిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామని సీఐ వెల్లడించారు.

మేయర్‌కు శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్ : నగర మేయర్ కె. సురేష్ బాబుకు నిర్మల స్కూల్ యాజమాన్య సభ్యులు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఆయన్ను కలిసి ఈ మేరకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్లు బాలస్వామి రెడ్డి, రెడ్డి ప్రసాద్, త్యాగరాజు, కె.బాబు, శంకరాపురం సింధు పాల్గొన్నారు.



మేయర్ సురేష్‌బాబుతో మాట్లాడుతున్న నిర్మల స్కూల్ యాజమాన్యం